సాక్షి
శ్రీకాకుళం
గురువారం । 23 । నవంబర్ । 2023



యాంత్రీకరణతో 'ఆదా'యం

వరి కోత, నూర్పులకు యంత్రాల వినియోగం పెరిగింది. దీంతో రైతుకు డబ్బు ఆదా అవుతోంది. -IIలో



బైక్ మెకానిక్ షెడ్లు దగ్ధం


పాతపట్నంలో బైక్ మెకానిక్ షెడ్లలో అగ్ని ప్రమాదం జరిగింది. షెడ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. -IIలో

సిక్కోలు జానపద కార్యదర్శిగా లోకేష్ మాస్టర్

కాశీబుగ్గ: ఉద్దాన ప్రాంతంలోని కళాకారులంతా ఏర్పాటు చేసుకున్న సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక ఆర్గనైజేషన్ ప్రధాన కార్యదర్శిగా గొరకల లోకేశ్వరరావును మరోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పలాస మండలం చిన్న నీలావతి గ్రామానికి చెందిన ఆయన అక్కుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

న్యూస్‌రీల్

కిడ్నీ ఆస్పత్రికి సీసీ రోడ్డు పూర్తి



కిడ్నీ ఆస్పత్రికి వెళ్లే సీసీ రోడ్డు పూర్తి కావడంతో పరిశీలిస్తున్న కమిషనర్ నాగేంద్రకుమార్

కాశీబుగ్గ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌కు సీసీ రోడ్డు ఏర్పాటు పూర్తయింది. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ వారు పాతజాతీయ రహదారి నుంచి ఆస్పత్రి వరకు సుమారు 200 మీటర్ల పొడవైన నాలుగు లైన్లతో కూడిన సీసీ రోడ్డు పనులు పూర్తి చేశారు. బుధవారం రాత్రి మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్, ఏఈ బీర అవినాష్, క్వాలిటీ కంట్రోల్ బృందంతో కలిసి పర్యవేక్షించారు.

జాతీయ బాక్సింగ్ పోటీలకు నలుగురు ఎంపిక



జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో లక్ష్మణ్‌దేవ్, ఉమామహేశ్వరరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆలిండియా బాక్సింగ్ చాంపియన్‌షిప్–2023 పోటీలకు శ్రీకాకుళం జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎంపికైనవారిలో పి.అప్పలరాజు, పి.విశ్వేశ్వరరావు, డి.మనోజ్‌కుమార్, హేమంత్‌కుమార్ ఉన్నారు. ఈ పోటీలు మేఘాలయలోని షిల్లాంగ్ వేదికగా ఈ నెల 24 ఉంచి డిసెంబర్ 2వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ పోటీలకు ఎంపికైన నలుగురు క్రీడాకారులు భీమేశ్వర బాక్సింగ్ క్లబ్‌లో శిక్షణ పొందుతున్న వారు కావడం విశేషం. వీరికి డీఎస్‌ఏ బాక్సింగ్ కోచ్ ఎం.ఉమామహేశ్వరరావు, అసిస్టెంట్ కోచ్ రాజీవ్ గాంధీ ఉన్నతంగా శిక్షణను అందించి తీర్చిదిద్దుతున్నారు. పోటీలకు రిఫరీగా జిల్లాకు చెందిన అనంత లక్ష్మణ్‌దేవ్ నియామం అయ్యారు. క్రీడాకారులతోపాటు ఆయన కూడా బయల్దేరి వెళ్లారు.

'మావోయిస్టు కదలికలు లేవు'



వజ్రపుకొత్తూరు పీఎస్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ నాగేశ్వరరెడ్డి

వజ్రపుకొత్తూరు: పలాస ప్రాంతంలో మావోయిస్టు కదలికలు లేవని కాశీబుగ్గ డీఎస్పీ జి.నాగేశ్వరరెడ్డి అన్నారు. ఆయన బుధవారం వజ్రపుకొత్తూరు పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి విలేకరులతో మాట్లాడారు. ఎస్‌బిఐ పరిశీలన, స్థానిక పోలీసులు చక్కటి అబ్జర్వేషన్ ఉండడం వల్ల ఈ ప్రాంతంలో మావోయిస్టు చర్యలకు అవకాశం లేదని అన్నారు. ప్రజల్లో అవగాహన పెరిగిందని శాంతి భద్రలతలకు ఎలాంటి ఢోకా లేదని అన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్, ట్రాఫిక్, మానవ అక్రమ రవాణా తదితర అంశాలపై అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కాశీబుగ్గ రూరల్ సీఐ జి.శంకరరావు, స్థానిక స్టేషన్ ఎస్‌ఐ వై.మధుసూదనరావు, సిబ్బంది ఉన్నారు.

'వ్యవస్థలపై నమ్మకం ప్రధానం'



మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: పారా లీగల్ వలంటీర్లు వ్యవస్థలపై ప్రజల్లో నమ్మకం కలిగించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యాలయం న్యాయ సేవా సదన్‌లో రెండో రోజు బుధవారం జరిగిన పారా లీగల్ వాలంటీర్స్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో ఆయన మాట్లాడారు. వ్యవస్థపై నమ్మకం ఉన్నప్పుడే ప్రజలకు భరోసా కల్పించగలమని అన్నారు. వ్యవస్థ అభ్యున్నతికి పాటుపడేటట్టుగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ఈ రెండో రోజు కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌గా న్యాయవాది అన్నెపు సత్యనారాయణ, కమ్యూనికేషన్ స్కిల్స్ న్యాయవాది మెట్ట సత్యనారాయణ, ఫ్యామిలీ చట్టం న్యాయవాది పీవీఎస్ సీతారామయ్య, ఆస్తి హక్కుల న్యాయవాది అన్నెపు భువనేశ్వరరావు క్రిమినల్ చట్టాలపై అవగాహన కల్పించారు.

బతుకు బాట మారేలా..



ఆటో డ్రైవింగ్ చేస్తున్న మహిళ

- ఎస్సీ, ఎస్టీ మహిళల జీవనోపాధికి మరో పథకం
- ఉన్నతి పథకంతో సున్నా వడ్డీకే రుణాలు
- ఆటో రిక్షాల కొనుగోలుకు ప్రోత్సాహం
- అర్హుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం



ఇచ్ఛాపురం రూరల్: ఎస్సీ, ఎస్టీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఉన్నతి–మహిళా శక్తి అనే ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకంలో ఎస్సీ, ఎస్టీ మహిళల జీవనోపాధికి సున్నా వడ్డీకే ఆటో రిక్షాలు అందిస్తోంది. ఆటోలు నడుపుకోవడం ద్వారా రోజువారీ ఆదాయం పొంది, తమ కాళ్లపై తాము నిలబడేందుకు ఈ పథకం దోహదం చేస్తుంది. లబ్ధిదారులపై ఎలాంటి భారం లేకుండా సులభ వాయిదాల రూపంలో రుణాలు చెల్లించుకుంటూ వచ్చే ఆదాయంతో కుటుంబాలను పోషించుకోవాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం.

ఈ ఏడాది నుంచే అమలు

2023–24 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ ఈ పథకాన్ని అమలులోకి తెచ్చేందుకు ప్రభుత్వం సమగ్ర ప్రణాళిక చేసింది. తొలి విడతలో జిల్లాకు 15 మంది లబ్ధిదారులను అధికారులు ఎంపిక చేసినప్పటికీ ప్రతి మండలం నుంచి ఒక్కో లబ్ధిదారు దరఖాస్తు చేసుకోవచ్చని సెర్ప్ అధికారులు చెబుతున్నారు.

లబ్ధిదారుల ఎంపిక ఇలా

సెర్ప్ ఉన్నతి విభాగం ద్వారా మహిళలకు శక్తివంతమైన జీవనోపాధి కల్పించేందుకు ప్రభుత్వం మహిళా శక్తి ఆటోరిక్షా పథకాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరానికి గానూ లబ్ధిదారుల ఎంపికకు అర్హులైన ఎస్సీ, ఎస్టీ మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఇప్పటికే స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోగా, మరింత మంది అర్హులను దరఖాస్తు చేసుకోవాలని కోరుతున్నారు.

పథకం పొందాలంటే..

- గ్రామంలోని ఎస్సీ, ఎస్టీలకు చెందిన డ్వాక్రా సంఘ సభ్యులై ఉండాలి.
- 20–45 ఏళ్ల మధ్య వయస్సుతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ లేదా ఎల్ఎల్ఆర్ ఉండాలి.
- ఉన్నతిలో ఎలాంటి బకాయి ఉండరాదు.
- పాసింజర్, ట్రాలీ, పెట్రోలు, డీజిల్, గ్యాస్ ఏ కంపెనీ అనేది లబ్ధిదారులే ఎంపిక చేసుకోవాలి.
- ఆమె పేరిట రిజిస్ట్రేషన్ చేస్తారు.
- ఆటో కొనుగోలు సమయంలో 10 శాతం వాటి ధనాన్ని తమ గ్రూపునకు జమ చేయాలి.
- ఆటో నడుపుతున్న నిమిషం నిడివి వీడియోతో సహా సమర్పించాలి.
- వాహనం, యజమాని ఇద్దరి పేరిట బీమా చేయాలి. ఆ ఖర్చు వారే భరించాలి.
- 48 నెలల్లో వడ్డీలేని రుణం చెల్లించాలి. అప్పటి వరకు ఆటోను విక్రయించకూడదు.
- వరుసగా మూడు వాయిదాలు చెల్లించకుంటే సమాఖ్య ఆటోను స్వాధీనం చేసుకుంటుంది.

సద్వినియోగం చేసుకోండి



ఉన్నతి పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు జీవనోపాధి కల్పించడం, వారి ఆదాయాన్ని వృద్ధి చేయడమే ఈ పథకం లక్ష్యం. ఈ పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులు ఆటోరిక్షా కొనుగోలు చేసి జీవనం సాగించేందుకు వడ్డీ లేని రుణాలు అందిస్తాం. ఆటో నడుపుకుంటూ నిర్దేశించిన సులభ వాయిదాలు చెల్లిస్తే చాలు. ఇప్పటికి జిల్లాలో 15 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో అర్హులైన ఎస్సీ, ఎస్టీ మహిళలు ఎంత మంది దరఖాస్తు చేసుకుంటే అంతమందికి రుణాలు అందిస్తాం.

– డి.విద్యాసాగర్, పీడీ, డీఆర్‌డీఏ, శ్రీకాకుళం జిల్లా

సంక్షేమ పథం

ఎన్నో ఏళ్లు ఎదురుచూశా..



మాది బూర్జ మండలంలోని ఓ గిరిజన గ్రామం. ఎన్ని ప్రభుత్వాలు మారినా నా తలరాత మారలేదు. రేషన్ కార్డు కోసం ఎన్నో ఏళ్లు ఎదురు చూశాను. టీడీపీ ప్రభుత్వంలో కూడా చాలా సార్లు దరఖాస్తు చేశాను. కానీ ఎవరూ పట్టించుకోలేదు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో నా మనవి విన్నవించుకున్నాను. వెనువెంటనే నాకు రేషన్ కార్డు మంజూరు చేశారు. వైఎస్ జగన్ నిర్వహించిన వినూత్న కార్యక్రమాల వల్లనే ఇలాంటివి సాధ్యమవుతాయి.

– ఆరిక ముఖలింగం, అల్లిపల్లి గూడ, వైకుంఠపురం పంచాయతీ, బూర్జ మండలం

ఉచితంగా వాహనం వచ్చింది..



ప్రభుత్వం నాకు రూ.లక్షా ముప్పై వేలు విలువ చేసే ఖరీదైన మూడు చక్రాల వాహనం ఇచ్చింది. నాకు రెండు కాళ్లు లేవు. వాహనం కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నాను. అన్నీ తనిఖీ చేశారు. నా సదరం సర్టిఫికెట్ కూడా చూశారు. పలాస నియోజకవర్గంలో పది మంది దివ్యాంగులకు వాహనాలు మంజూరయ్యాయి. ఆ లబ్ధిదారుల్లో నేనూ ఒకడిని. ఇది వరకు మూడు చక్రాల సైకిల్‌పై రాకపోకలు జరిపే వాడిని. చేతులు నొప్పి పుట్టి బొబ్బర్లు వచ్చేవి. ప్రస్తుతం ఎంతదూరమైనా నేనే వెళ్తున్నాను. ఇది వరకు మా కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, మిత్రులు నాకు సహకరించేవారు. ప్రస్తుతం కృతజ్ఞతతో అవసరాన్ని బట్టి నేను కూడా వారికి సాయం చేస్తున్నాను. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు.

– దున్న బాలకృష్ణ, సున్నాదేవి గ్రామం, పలాస మండలం

ఆర్అండ్ఆర్ కాలనీ పరిశీలన



ఆర్అండ్ఆర్ కాలనీ మ్యాప్‌ను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ నవీన్

సంతబొమ్మాళి: నౌపడలో నిర్మితమవుతున్న మూలపేట పోర్టు నిర్వాసిత కాలనీ పనులను జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ బుధవారం పరిశీలించారు. రూ. 35కోట్లతో 55 ఎకరాల్లో నిర్మితమవుతున్న కాలనీకి ఎర్త్ లెవలింగ్ పనులు, గ్రావెల్ రోడ్డు పనులు ఎంతవరకు వచ్చాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన కాలనీ సిద్ధం చేయించాలని సబ్ కలెక్టర్ నూరుల్ కుమార్, తహసీల్దార్ చలమయ్యను ఆదేశించారు. డ్రైనేజీ, తాగునీటి సరఫరా పనులు ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల అధికారులు ఆదేశించారు. కాలనీలోని మౌలిక వసతులు, భవనాలు, పాఠశాలలు ఏర్పాటు వంటి విషయాలను మ్యాప్ ద్వారా అధికారులను అడిగి ఆరా తీశారు. కార్యక్రమంలో స్థానిక రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● సీఎంను కలిసిన దాసన్న



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ బుధవారం సాయంత్రం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ప్రత్యేకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో రాజకీయ పరిస్థితులు, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం అమలు తీరు, సామాజిక సాధికార యాత్రలు జరిగిన తీరు, పార్టీ పరిస్థితిపై చర్చించారు. త్వరలో ఉద్దానం మంచినీటి ప్రాజెక్టు, పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ప్రారంభోత్సవానికి వస్తున్నట్లు సీఎం చెప్పారని ఎమ్మెల్యే తెలిపారు. కృష్ణదాస్‌తో పాటు పోలాకి జెడ్పీటీసీ, పార్టీ బీసీ సెల్ జోనల్ కన్వీనర్ ధర్మాన కృష్ణ చైతన్య ఉన్నారు. –నరసన్నపేట

'బీఎల్ఏల జాబితా అందించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి గణపతిరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఓటర్ల జాబితాకు సంబంధించిన అన్ని క్లెయిములు డిసెంబర్ 26 నాటికి పూర్తి చేస్తామని డీఆర్ఓ ఎం.గణపతిరావు అన్నారు. వైఎస్సార్ సీపీ, టీడీపీ మినహా మిగిలిన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు బూత్ లెవెల్ ఏజెంట్ (బీఎల్ఏ)ల జాబితాలు ఇంకా అందజేయలేదని, వాటిని జిల్లా ఎన్నికల అధికారి వారికి త్వరగా అందజేయాలని కోరారు. తన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన 19వ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫారం 6, 7, 8లకు సంబంధించి జిల్లాలో 10,728 దరఖాస్తులు వచ్చాయని, వాటిని త్వరిత గతిన పరిష్కరిస్తామన్నారు. కొత్తగా 72,711 మంది ఓటర్లుగా నమోదయ్యారని, పాత జాబితాలో 42,020 మందిని తొలగించామని, ఇందులో 22,454 మంది మృతి చెందిన వారున్నారని చెప్పారు. క్లెయిములు స్వీకరించేందుకు డిసెంబర్ 9వ తేదీ ఆఖరని, అలాగే డిసెంబర్ 2, 3వ తేదీల్లో క్లెయిములు స్వీకరించేందుకు ఆయా బూత్‌లలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మార్పులు, చేర్పులతో ఓటర్ల జాబితా ప్రక్రియ డిసెంబర్ 26వ తేదీ నాటికి పూర్తి చేస్తామని డీఆర్ఓ స్పష్టం చేశారు. సమావేశంలో రౌతు శంకరరావు (వైఎస్సార్ సీపీ), పీఎంజే బాబు (టీడీపీ), గోవింద మల్లిబాబు (కాంగ్రెస్), సోమేశ్వరరావు (బీఎస్పీ), కోరాడ అప్పలరాజు (బీజేపీ) తదితరులు ఉన్నారు.

జాతీయ బాస్కెట్‌బాల్ శిక్షణ శిబిరాలకు ఇద్దరు ఎంపిక



ఎంపికైన జయకృష్ణ, హఫీజలను అభినందిస్తున్న ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి, అర్జున్‌రెడ్డి

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ సీనియర్స్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ ప్రాబబుల్స్ జట్టుకు శ్రీకాకుళం జిల్లా నుంచి పురుషుల జట్టుకు కె.జయకృష్ణ, మహిళల జట్టుకు ఎండీ హఫీజ ఎంపికయ్యారు. ఈ శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకుని, ఆ పోటీలకు పూర్తిస్థాయిలో సన్నద్ధమై ఆంధ్రప్రదేశ్ జట్టును విజయ పథంలో నిలపాలని శ్రీకాకుళం జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. ఈ శిక్షణ శిబిరాలు చిత్తూరు జిల్లాలో ఈనెల 22 నుంచి నెలాఖరు వరకు జరగనున్నాయి. ఇప్పటికే వీరిద్దరూ కోచింగ్ క్యాంప్ చీఫ్ కోచ్ వద్ద రిపోర్ట్ చేశారు. శిక్షణ శిబిరాల కోసం పయనమైన క్రీడాకారులకు సంఘ జిల్లా కార్యదర్శి, డీఎస్‌ఏ కోచ్ జి.అర్జున్‌రావురెడ్డితో మంగళవారం రాత్రి కలిసి ఎమ్మెస్సార్ తన నివాసంలో వీడ్కోలు పలికారు. ఎంపికైన వారిలో కె.జయకృష్ణ ఎల్ఎన్‌పేటలో సచివాలయం ఉద్యోగి(సర్వేయర్)గా పనిచేస్తుండగా, ఎండీ హఫీజ కానిస్టేబుల్ దిశా పోలీస్‌స్టేషన్ శ్రీకాకుళంగా పనిచేస్తున్నారు.

'పోర్టు వాహనాలు జాగ్రత్తగా నడపాలి'

టెక్కలి: మూలపేట పోర్టుకు రాకపోకలు సాగిస్తున్న ట్రాన్స్‌పోర్టు వాహనాలు జాగ్రత్తగా నడపాలని టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి ఆదేశించారు. బుధవారం టెక్కలిలో మూలపేట పోర్టు వాహనాల యజమానులు, డ్రైవర్లకు సలహాలు, సూచనలు అందజేశారు. ప్రతి రోజూ పోర్టుకు రాళ్ల తరలిస్తున్న వాహనాలు పరిమితమైన వేగాన్ని పాటించాలన్నారు. ముఖ్యంగా పట్టణం పరిధిలో ఎలాంటి ప్రమాదాలు లేకుండా జాగ్రత్తగా వాహనాలు నడపాలని డీఎస్పీ సూచించారు.

రహదారి రక్తసిక్తం

- లారీ ఢీకొని ఇద్దరు రైతులు మృతి
- పొలానికి వెళ్తుండగా ఘటన



ఘటనా స్థలంలో ద్విచక్రవాహనంపై ఉన్న లారీ (ఇన్‌సెట్లో) బొంగు సుందరరావు (ఫైల్)





లారీ టైర్ల కింద నుజ్జయిన సుందరరావు, మిన్నారావు మృతదేహాలు

కాశీబుగ్గ:

నీలావతి జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు రైతులు మృతి చెందారు. పొలానికి వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. పెద్ద నీలావతి గ్రామానికి చెందిన బొంగు సుందరరావు (40), కొండాల మిన్నారావు (41)లు బైక్‌పై ఉజ్జిడిమెట్ట వద్ద ఉన్న పొలాలను చూసేందుకు వెళ్లారు. కొబ్బరి చెట్లూరు కూడలి వద్దకు చేరుకుని పంటపొలానికి దగ్గర అవుతుందనగా.. రాంగ్ రూట్‌లో నీలావతి గేటువైపు వస్తుండగా ఎదురుగా వస్తున్న లారీ వీరి బండిని బలంగా ఢీకొట్టింది. దీంతో వీరిద్దరూ కింద పడగా.. వారిపై నుంచి లారీ వెళ్లిపోయింది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. నీలావతి రైలుగేటుకు వందమీటర్ల దూరంలో జరిగిన సంఘటనను చూసిన వారంతా నివ్వెరపోయారు. విషయం తెలుసుకున్న కాశీబుగ్గ పోలీసులు, హైవే అంబులెన్స్ సిబ్బంది మృతదేహాలను పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు.

పెద్దనీలావతి గ్రామానికి చెందిన బొంగు సుందరరావుకు భార్య బొంగు గీత, కుమారులు విషాల్, రోహిత్‌లు ఉన్నారు. మరో మృతుడు కొండాల మిన్నారావుకు భార్య జానకి, కుమార్తె భాగ్య ఉన్నారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని గుండెలవిసేలా రోదించారు. ప్రమాదంపై కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొలనులో ఉత్సవం.. కోవెలలో ఉత్సాహం

- ఆదిత్యుని తెప్పోత్సవం రేపు
- రంగులతో సిద్ధమైన హంస వాహనం
- నేడు ట్రయల్ రన్



ఇంద్రపుష్కరిణిలో సిద్ధంగా ఉన్న హంసవాహనం

అరసవల్లి: కోవెల కొలనులో సూరీడు కదిలే వేళయ్యింది. క్షీరాబ్ధి ద్వాదశి నాడు ఇంద్ర పుష్కరిణిలో విహరించడానికి సమయం ఆసన్నమైంది. ప్రసిద్ధ అరసవల్లి సూర్యక్షేత్రంలో శుక్రవారం ఆదిత్యుడు హంస వాహనంలో దేవేరులతో కలిసి ఇంద్రపుష్కరిణిలో విహరించనున్నారు. అదే రోజు స్వామి స్వర్ణాలంకరణలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు దర్శనమిచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆలయం లోపల, బయట కూడా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏటా కార్తీక శుద్ధ ద్వాదశి నాడు ముగ్గురు దేవేరులతో స్వామి హంస వాహనంలో 12 సార్లు విహరించడం ఇక్కడి క్షేత్రంలో సంప్రదాయం. ఈ ఉత్సవానికి వేలల్లో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, అలాగే అధిక సంఖ్యలో మహిళలు కార్తీక దీపాలను తెప్పల్లో విడిచిపెట్టేందుకు రానున్న సందర్భంగా పుష్కరిణి ఘాట్ వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ సభ్యులు ఈ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. ఈ ఉత్సవం కోసం పుష్కరిణి చుట్టూ బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఆవరణ అంతా శుభ్రపరిచి విద్యుత్ అలంకరణ చర్యలు చేపట్టారు.

నేడు ట్రయల్ రన్

హంసవాహనం ఫిట్‌నెస్ పరీక్ష గురువారం జరుగనుంది. పవిత్ర ఇంద్ర పుష్కరిణిలో 12 సార్లు విహరించేలా అందుకు తగిన సామర్థ్యం కోసం నేడు ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. ఆలయ ఈఓ హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకర శర్మలతో పాటు పాలకమండలి సభ్యులు, మత్స్య శాఖ, ఫైర్, పోలీస్ ఇతరత్రా సాంకేతిక సిబ్బందంతా ఈ ట్రయల్‌రన్‌లో పాల్గొని లోపాలుంటే సరిచేసేలా చర్యలు చేపట్టనున్నారు. అంతా పక్కా అని అధికారులు ధ్రువీకరించగానే శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి హంస విహారం ప్రారంభం కానుంది. ఇటీవల ఆలయ పాలకమండలి సభ్యులు తీర్మానించిన మేరకు ఈ హంసవాహనంలో ఈసారి వైదిక సిబ్బంది (అర్చక పండితులు) పాటు బోటు సిబ్బంది మాత్రమే వాహనం ఎక్కేందుకు అనుమతి ఉండనుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని పోలీస్ సిబ్బంది తగు చర్యలు చేపట్టనున్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు



తెప్పోత్సవానికి ఈసారి భక్తుల సంఖ్య అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ఆలయ పరిసరాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం. అలాగే శుక్రవారం దర్శన సమయాల్లో స్వర్ణాలంకరణతో స్వామి వారిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నాం. అలాగే గురువారం హంసవాహనం ట్రయల్ రన్ చేసి పూర్తి స్థాయి ఫిట్‌నెస్‌తోనే తెప్పోత్సవాన్ని నిర్వహించనున్నాం. ఈ వాహనంలోకి అర్చకులు, సహాయకులకు మాత్రమే అనుమతివ్వనున్నాం.

– వి.హరిసూర్యప్రకాష్, ఆలయ ఈఓ

క్లుప్తంగా

ఎచ్చెర్ల ఐటీఐలో అప్రెంటీస్ మేళా



మాట్లాడుతున్న ఐటీఐ ప్రిన్సిపాల్ సుధాకర్‌రావు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం (ఐటీఐ)లో బుధవారం హైదరాబాద్‌కు చెందిన సర్వో మేధా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అప్రెంటీస్, జాబ్‌మేళా నిర్వహించింది. జిల్లా నుంచి ఐటీఐ పూర్తిచేసిన 239 మంది హాజరయ్యారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూల ఆధారంగా 23 మందిని ఎంపిక చేశారు. అప్రెంటీస్ అనంతరం ఉద్యోగాలు కల్పించనున్నారు. ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్‌రావు, కంపెనీ ప్రతినిధులు పర్యవేక్షించారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

రణస్థలం: పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. జె.ఆర్.పురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లావేరు మండలం బుడుమూరు గ్రామానికి చెందిన నల్లి రాజేష్‌కు(24) విజయనగరం జిల్లా వంగర గ్రామానికి చెందిన గొర్లె అనూషతో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఏడాది వయసున్న కుమారుడు ఉన్నాడు. రాజేష్ రణస్థలంలోనే ఉంటూ ఓ బైక్ షోరూంలో పని చేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఈ నెల 10న పురుగులు మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. భార్య అనూషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని ఎస్ఐ రాజేష్ తెలిపారు.

పోరాటయోధుడు పినకాన



నివాళులు అర్పిస్తున్న నాయకులు, కుటుంబ సభ్యులు

నందిగాం: నిర్బంధాలను ఎదిరించి శ్రమజీవులు పక్షాన పోరాటం చేసిన యోధుడు పినకాన కృష్ణమూర్తి అని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు భవిరి కృష్ణమూర్తి అన్నారు. నందిగాం మండలం చిన్నలక్ష్మీపురంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు నంబూరు షణ్ముఖరావు అధ్యక్షతన బుధవారం పినకాన కృష్ణమూర్తి ఏడో వర్ధంతి సభ నిర్వహించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పినకాన కుటుంబ సభ్యులతో పాటు కోనారి మోహనరావు, పినకాన అజయ్‌కుమార్, కోత మధు, కింతలి ధర్మారావు, పాలిన సాంబమూర్తి, హెచ్.ఈశ్వరరావు, బగాది వాసుదేవ్, మామిడి వసంత్, ముడిదాన ఆదినారాయణ, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.


వివాదాస్పద రోడ్డు పరిశీలన



నారువలో భూములు పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

రణస్థలం: మండలంలోని నారువ గ్రామ రెవెన్యూ పరిధిలో కొత్తగా నిర్మించనున్న నాగార్జున అగ్రికెమ్ లిమిటెడ్ రహదారిని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ బుధవారం పరిశీలించారు. గ్రామంలో ఎన్ఏసీఎల్ ప్లాంట్‌కు కేటాయించిన భూములు, రహదారి వివరాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమ వెనుక వైపు ఉన్న కొంతాలపాలెం గ్రామానికి రహదారి వెళ్లాల్సి ఉంది. అయితే రహదారి స్థలం మరో పరిశ్రమకు రిజిస్ట్రేషన్ కావడంతో వివాదం ఏర్పడింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కారానికి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో సీహెచ్ రంగయ్య, తహసీల్దార్ సనపల కిరణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వీఏఎస్ఏఎస్ఏ నూతన కార్యవర్గం ఎన్నిక



కార్యవర్గ ప్రతినిధులకు అభినందనలు తెలుపుతున్న జేడీ

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ సర్వీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం జిల్లా కేంద్రంలో జరిగింది. అధ్యక్షుడిగా దువ్వాడ శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా బి.చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా టి.హరికృష్ణ, ట్రెజరర్‌గా ఎల్.కిరణ్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా ఎస్.ఓంకార్‌లు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ ఎం.కిషోర్, డిప్యూటీ డైరెక్టర్లు ఎం.జగన్నాథం, వి.జయరాజు, రాజగోపాల్, చంద్రశేఖర్, రవికృష్ణలు శుభాకాంక్షలు తెలిపారు.

యాంత్రీకరణతో 'ఆదా'యం

- పెరిగిన వరికోత, నూర్పిడి యంత్రాల వినియోగం
- ఆదా అవుతున్న ఖర్చులు, సమయం
- ఆసక్తి చూపుతున్న అన్నదాతలు



వరికోత యంత్రంతో నూర్పిడి చేస్తున్న దృశ్యం

ఆమదాలవలస రూరల్: వ్యవసాయంలో యంత్రాల వినియోగంపై జిల్లా రైతులు ఆసక్తి చూపుతున్నారు. తద్వారా ఖర్చులు, సమయాన్ని ఆదా చేసుకుంటున్నారు. వరి పొలాలు ప్రస్తుతం కోత, నూర్పిడి దశలో ఉన్నాయి. గతంలో ఈ పనులను వ్యవసాయ కూలీలతో చేయించేవారు. తీవ్ర వ్యయప్రయాసలకు గురయ్యేవారు. వరికోత, నూర్పిడి యంత్రాలతో పనులు సునాయసంగా పూర్తవుతుండడంతో వీటి వినియోగం ఇటీవల కాలంలో బాగా పెరిగింది. వరి కోత యంత్రం పంటను కోసి పనలుగా వేస్తుండగా, నూర్పిడి యంత్రం పంటను కోసి నూర్పిడి చేసి రైతుగా నేరుగా ధాన్యం అందిస్తుంది. అయితే నూర్పిడి యంత్రంతో ఎండుగట్టి రద్దుగా మారుతుండడంతో పశు గ్రాసానికి పనికిరావడం లేదు. దీనవల్ల కొందరు రైతులు వరి కోత యంత్రాన్ని మాత్రమే వినియోగిస్తున్నారు.

జిల్లాలో వరిసాగు విస్తీర్ణం	1,41,330 హెక్టార్లు
ఈ ఏడాది వరిపంట దిగుబడి అంచనా	8.40 లక్షల మెట్రిక్ టన్నులు
వరి పంట కోత, నూర్పిడికి ఏకకాలంలో గంటకు	రూ.2500
రైతులకు ఆదా	ఎకరాకు రూ.4 వేలు వరకు

పెట్టుబడులు ఆదా..

సాధారణంగా ఎకరా విస్తీర్ణంలో వరి పంట కోయాలంటే 10 నుంచి 12 మంది కూలీలు అవసరం. ఒక్కొక్కరికి రూ. 300 చొప్పున కూలీ ఇస్తే రూ.3000 అవుతుంది. దీంతో పాటు వరిపనలు కుప్పలు చేయడానికి రూ.2వేలు, మరాల నూర్పిడికి రూ.2500 వరకు ఖర్చవుతుంది. ఇదే వరికోత నూర్పిడి యంత్రాన్ని ఉపయోగిస్తే రూ.2700తో మొత్తం పని అయిపోతుంది. ఎకరం పొలాన్ని గంటలోనే వరికోత, నూర్పిడి చేస్తుంది. దీంతో రైతులకు ఎకరానికి రూ.4 వేలు వరకు ఆదా అవుతుంది. అంతేకాకుండా ధాన్యం కూలీలతో కోసేటప్పుడు రాలిపోయే అవకాశం ఉంది. పనలు కూడా వత్తుగా పడతాయి. అవి ఆరడానికి తిరగేయాల్సి వస్తుంది. అదే యంత్రంతో కోత చేస్తే పన పలచగా పడి తిరగేయాల్సిన పని లేదు. వరి నూర్పిడి యంత్రంతో పనిచేస్తే ఏకంగా ధాన్యం చేతికి వస్తాయి. యంత్రాలను కూడా వ్యవసాయ శాఖ రైతులకు అందుబాటులో తీసుకొస్తోంది. రైతు భరోసా కేంద్రాల పరిధిలో రైతులు గ్రూపులుగా ఏర్పడినా, రైతు సొంతంగా యంత్రాల కొనుగోలు చేయాలన్నా కియోస్క్ యంత్రం ద్వారా ఆర్డర్ చేస్తే సరిపోతుంది. ఇప్పటికే గ్రామాల్లో యంత్రాల ద్వారా వరికోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి.

ఆశల దిగుబడి..

ఈ ఏడాది ఖరీఫ్ సాగు చేసిన వరి పంట చేతికందడంతో రైతులు దిగుబడులపై ఆశలు పెట్టుకున్నారు. నూర్పిడి యంత్రంతో వరికోతలు కోయడం వల్ల ధాన్యం కూడా దిగుబడులు ఎంత వస్తున్నాయో రైతులకు తెలుస్తున్నాయి. ఎకరాకు 28 నుంచి 32 బస్తాలు (82 కిలోలు) దిగుబడి వస్తుండడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కోత అనంతరం ధాన్యాన్ని కుప్పగా వేస్తున్న యంత్రం

పని సులువు..



వరిపంటలో కోత, నూర్పిడి యంత్రం వినియోగంచడం ద్వారా ఖర్చులు, సమయం ఆదా అవుతాయి. సకాలంలో కోతలు పూర్తయి ధాన్యం అమ్మకాలు సులువుగా చేసుకోవచ్చు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే పంటకు మంచి గిట్టుబాటు ధర కలుగుతుంది. ప్రస్తుతం యాంత్రీకరణ ద్వారా వరికోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి.

– మెట్ట మోహనరావు, మండల వ్యవసాయాధికారి, ఆమదాలవలస

డీవైఈఓకు అభినందనలు



విజయకుమారికి అభినందనలు తెలుపుతున్న ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ఉప విద్యాశాఖాధికారిగా నియమితులైన రాకోటి విజయకుమారి(డీవైఈవో)ని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర, జిల్లాశాఖల ప్రతినిధులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆర్ఎంఎస్ఏ ఉప విద్యాశాఖాధికారిగా, పాలకొండ డిప్యూటీ ఈవోగా, ప్రధానోపాధ్యాయులుగా విజయవంతంగా సేవలు అందించి శ్రీకాకుళం డిప్యూటీ ఈవోగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న విద్యా సంబంధిత సమస్యలు పరిష్కరించాలని, ఉపాధ్యాయులకు బాసటగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు బొత్స జానకీరామ్, గౌరవాధ్యక్షుడు సోరీ ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనెల రమేష్, జిల్లా అధ్యక్షుడు వడమ శరత్, జిల్లా కార్యదర్శి జగదీష్, విజయప్రసాద్, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సబ్జెక్టులపై పట్టు సాధించాలి



మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వరరావు

నరసన్నపేట: విద్యార్థుల్లో చదవడం, రాయడం స్కిల్స్ అభివృద్ధి చేసేందుకు వీలుగా ఉపాధ్యాయులు సబ్జెక్టులపై మరింత పట్టు సాధించడానికి శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నరసన్నపేట, పోలాకి మండలాలకు చెందిన 6, 7, 8వ తరగతుల ఇంగ్లిష్ ఉపాధ్యాయులకు బుధవారం లిప్ శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులు, ఆధునిక విద్యా బోధనలు దృష్టిలో పెట్టుకొని నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. ప్రధానంగా విద్యార్థుల్లో చదవడం, రాయడం వంటి స్కిల్స్ అభివృద్ధి చేయడంపై దృష్టి సారించినట్లు తెలిపారు. హిందీ తప్ప మిగిలిన సబ్జెక్టుల్లో శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు యు.శాంతారావు, దాలినాయుడు, హెచ్ఎం వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ శాఖలో అక్రమ వసూళ్లపై విచారణ



విచారణ చేపడుతున్న డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి

రణస్థలం: మండలంలోని ప్రభుత్వ మద్యం దుకాణదారుల సూపర్‌వైజర్లు, సేల్స్‌మేన్ల నుంచి ఎక్సైజ్ శాఖలోని ఓ ఉన్నతాధికారి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఫిర్యాదుపై విచారణ చేస్తున్నామని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ (ఎస్ఈబీ) డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం రణస్థలం వెలుగు కార్యాలయంలో ప్రభుత్వ మద్యం దుకాణాల సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్, అద్దె ఓనర్లను విచారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ వైజర్లు, సేల్స్‌మెన్లు బదిలీలపై అక్రమ వసూళ్లు, దుకాణదారుల నుంచి నెల అద్దె సొమ్ము ఇవ్వాలనే డిమాండ్లపై ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. విచారణలో అసిస్టెంట్ కమిషనర్ పైడి రామచంద్రరావు, సీఐ రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సమరశీల పోరాటాలే శరణ్యం



మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ రాష్ట్ర నాయకుడు కొండయ్య

వజ్రపుకొత్తూరు రూరల్: ప్రతిఘటనతో సాగే సమరశీల ప్రజా పోరాటాలే అమరవీరులకు నిజమైన నివాళి అని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమొక్రసీ రాష్ట్ర నాయకుడు వై.కొండయ్య, జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాశ్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ అన్నారు. మర్రిపాడులోని తామాడ గణపతినగర్‌లో బుధవారం అమరవీరుల 45వ స్మారక సభ నిర్వహించారు. అనంతరం అమరవీరుల స్థూపం వద్ద విప్లవజోహార్లు అర్పించారు. ప్రజా సంఘ నాయకుడు జి.బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు రాపాక మాధవరావు, ఎస్.నీలంరాజు, కుత్తుం హేమమ్మ, బర్ల గోపి, సార జగన్, బి.భాస్కరరావు, సింహాద్రి, మల్లేశ్వరరావు, కర్రి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాన్ ఢీకొని యువకుడికి గాయాలు

శ్రీకాకుళం క్రైమ్ : కోళ్ల వ్యాన్ ఢీకొనడంతో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయని ట్రాఫిక్ ఎస్ఐ జె.రామారావు తెలిపారు. గూనపాలేనికి చెందిన జన్నల వెంకటేష్ ఏపీజీవీబీ బ్యాంకులో ఒప్పంద ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి రామలక్ష్మణ కూడలి వద్ద బస్సు దిగి నడిచి వెళ్తుండగా నరసన్నపేట నుంచి శ్రీకాకుళం నగరంలోకి వస్తున్న కోళ్ల వ్యాను ఒక్కసారిగా ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకటేష్ ఎడమకాలు విరగడంతో రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. బుధవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

పీజీ కోర్సుల్లో సిలబస్ మార్పు తప్పనిసరి



మాట్లాడుతున్న వీసీ నిమ్మ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో కాలానుగుణంగా సిలబస్‌లో మార్పులు తప్పనిసరి చేయాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. ఎచ్చెర్లలోని వర్సిటీ పాలక మండలి సమావేశ మందిరంలో బుధవారం పీజీ కోర్సుల కరిక్యులమ్, సిలబస్‌లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానం-2020 నేపథ్యంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అనుగుణంగా కోర్సులనిర్వహణపై కసరత్తు జరగుతుందని చెప్పారు. ఉన్నత విద్యా మండలి సైతం విద్యార్థుల్లో నైపుణ్యాలకు ప్రాధాన్యమిస్తుందన్నారు. పరిశ్రమలు, జాతీయ అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో అనుసంధానం చేసి కోర్సులు నిర్వహిస్తామన్నారు. డిగ్రీ విద్యలో సైతం సమూల మార్పులు వస్తున్నాయని చెప్పారు. హానర్స్, సమీకృత నాలుగేళ్ల డిగ్రీ కోర్సులు ప్రారంభమవుతున్నాయని తెలిపారు. డిగ్రీ సబ్జెక్టుల్లో వచ్చిన మార్పులకు అనుగుణంగా పీజీ విద్యలో మార్పులకు శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం వర్సిటీ పరిధిలో నాగార్జున అగ్రికెం, అరబిందో ఫార్మా, కృష్ణపట్నం సెక్యూరిటీ లిమిటెడ్ వంటి సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాలు, అమలు, విద్యలో ప్రయోజనాలు, భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికపై సమీక్షించారు. కార్యక్రమంలో పరిశ్రమల ప్రతినిధులు శివకుమార్, శ్యాంకుమార్, మనోహర్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాళ్లు ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్, డాక్టర్ చింతాడ రాజశేఖరరావు పాల్గొన్నారు.

10న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల మహాసభలు



పోస్టర్‌ను ఆవిష్కరించిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం: ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆధ్వర్యంలో డిసెంబర్ 10న విజయవాడలో జరిగే మహాసభలను విజయవంతం చేయాలని ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు కె.సుమన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు రిమ్స్ అస్పత్రి ప్రాంగణంలో బుధవారం ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ప్రథమ మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమాన పనికి సమాన వేతనం, గౌరవం లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. మహాసభలకు ముఖ్య అతిథిగా ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి హాజరవుతున్నారని,. సమస్యలు ఆయన దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులంతా సభకు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గణేష్, రిమ్స్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.సింహాచలం, శశి తులసిభవాని, పద్మ, చింతాడ జనార్దన్, నక్క శ్రీనివాస్, ధన్వంతరి, పి.రామారావు, గణపతి, అప్పారావు పాల్గొన్నారు.

బైక్ మెకానిక్ షెడ్లు దగ్ధం



కాలిపోతున్న షెడ్లు

పాతపట్నం: మండలంలోని పెద్దసీది పంచాయతీ చంద్రయ్యపేటలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో బైక్ మెకానిక్ షెడ్లు దగ్ధమయ్యాయి. చంద్రయ్యపేటలో రహదారి పక్కన కొమనాపల్లి గ్రామానికి చెందిన దోమ ధర్మారావు కొంతకాలంగా బైకులు రిపేర్ చేస్తున్నాడు. అతని షెడ్ పక్కనే మరో షెడ్‌లో మొర్రి వెంకటరమణ బైక్ స్పేర్ పార్టులు అమ్ముతున్నాడు. బుధవారం ఉదయం 7 గంటల సమయంలో బైక్ షెడ్‌లో మంటలు చెలరేగాయి. పక్కనే ఉన్న మరో షెడ్‌లోకి మంటలు వ్యాపించాయి. ఈ ఘటనలో 8 బైకులు, స్పేర్ పార్టులు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామస్తులు వెంటనే కొత్తూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో రూ.16 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించి ఉంటాయని గ్రామస్తులు భావిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉందని కొత్తూరు అగ్నిమాపకాధికారి ఎం.బుచ్చోడు తెలిపారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ



భూమిపూజ నిర్వహిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు

సోంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో గ్రామీణ రహదారులకు మహర్దశ కలిగిందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. సోంపేట మండలం మాలగోవిందపురం కాలనీ నుంచి కంచిలి మండలం కొనక వరకు రూ.4 కోట్ల ఐటీడీఏ నిధులతో చేపట్టనున్న ఏడు కిలోమీటర్ల సీసీ రహదారి నిర్మాణానికి ఎమ్మెల్సీ నర్తు రామారావుతో కలిసి బుధవారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ప్రజలు మళ్లీ ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో సోంపేట ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, ఇప్పిలి కృష్ణారావు, ఏఎంసీ చైర్మన్ బతకల మోహనరావు, పీఏసీఎస్ చైర్మన్ రౌతు విశ్వనాథం, సర్పంచ్ బి.హరీష్‌కుమార్, కోఆప్షన్ మెంబర్ వినోద్ చంద్ర పండా, పార్టీ నాయకులు ఉత్తరాల బ్రహ్మానందం, ఉత్తరాల కృష్ణారావు, సవర త్రినాథ్, సవర అలేఖ్, సవర సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుడు మృతి



ఘటనా స్థలంలో మృతదేహం



అప్పన్న (ఫైల్)

నరసన్నపేట: స్థానిక పెద్దపేట వీధిలో నూతన భవనం నిర్మాణ పనుల్లో పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికుడు పల్లి అప్పన్న (47) ప్రమాదవశాత్తు మృతి చెందాడు. బుధవారం సాయంత్రం మూడో అంతస్తు పైకి వాటర్ ట్యాంకు తీసుకువెళ్తుండగా జారి పడటంతో అక్కడికక్కడే మరణించాడు. నరసన్నపేటలోని ముద్దాడ వీధికి అప్పన్నకు భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తె ఉన్నారు. పెద్ద కుమార్తె మౌనికకు వివాహం కాగా రేవతికి వివాహం కావాల్సి ఉంది. మృతుడి భార్య లక్ష్మి నరసన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డిగ్రీ విద్యార్థులకు ఉచిత శిక్షణ

శ్రీకాకుళం రూరల్: డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు పేషెంట్ రిలేషన్స్ అసోసియేట్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తూ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కిట్స్ సహకారంతో కృష్ణా జిల్లా నందిగామలో కిట్స్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, కిమ్స్ రిసెర్చ్ అండ్ ఫౌండేషన్ సహకారంతో హైదరాబాద్‌లో శిక్షణ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. రెండు నెలల శిక్షణ పూర్తయిన వెంటనే కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. పూర్తి వివరాలకు రాగోలు జెమ్స్ ఆసుపత్రిలోని బొల్లినేని మెడిస్కిల్స్ విభాగాన్ని గానీ, 7680945357, 7995013422 నంబర్లను గానీ సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

గిరిజన గ్రామాల్లో రెడ్‌క్రాస్ సాయం



గిరిజనులకు కిట్లు అందజేస్తున్న ఎంపీడీఓ, రెడ్‌క్రాస్ ప్రతినిధులు

మందస: గిరిజన గ్రామాల్లో సింగపూర్ రెడ్‌క్రాస్ ప్రతినిధుల సాయం బుధవారం కూడా కొనసాగింది. చీపి పంచాయతీలోని దాళసరి, పుట్టూరు, కొండమెర, నారాయణపురం గ్రామాల్లో పేద గిరిజనులకు సింగపూర్ రెడ్‌క్రాస్ ప్రతినిధులు దానియల్, ఎం.సత్యనారాయణ, ఎంపీడీఓ వాయలపల్లి తిరుమలరావు దోమతెరలు, దుప్పట్లు, పరిశుభ్రత కిట్లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సవర లక్ష్మీప్రియ, ఎంపీటీసీ సవర కాంచన, వైఎస్సార్ సీపీ నాయకులు సవర చిరంజీవి, గార కూర్మారావు, పంచాయతీ కార్యదర్శి మజ్జి సోమేశు, సచివాలయం సిబ్బంది, రెడ్‌క్రాస్ జిల్లా ప్రతినిధులు పి.శ్రీకాంత్, పి.చైతన్య కుమార్, కె.సత్యనారాయణ, ఎం.కల్యాణచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

• ప్రదర్శన అదుర్స్!



శ్రీకాకుళం నగరంలోని బ్యాంకర్స్ కాలనీలో సాయి బృందావనం వద్ద సత్యసాయి జయంతి వేడుకల్లో భాగంగా బుధవారం ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అభినయ నృత్యనికేతన్ నృత్యదర్శకులు డాక్టర్ టి.నీరజా సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో అద్భుత ప్రదర్శన ఇచ్చారు.

– శ్రీకాకుళం కల్చరల్